క్లుప్తంగా

ఎయిర్‌పోర్టుకు రాణి రుద్రమదేవి పేరు పెట్టాలి



నయీంనగర్: వరంగల్ జిల్లాకు మంజూరైన విమానాశ్రయానికి రాణి రుద్రమదేవి విమానాశ్రయంగా నామకరణం చేయాలని జాగృతి రాష్ట్ర నాయకురాలు మారిపెల్లి మాధవి డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించే దిశగా అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాణి మంజుల, సమ్మక్క, హైమవతి, సరోజన తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి చేయూత



రామన్నపేట: నగరంలోని రామన్నపేటలోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధ మహిళ రాజ్యలక్ష్మికి ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ సోమవారం చెక్కబల్ల అందజేశారు. వృద్ధురాలు కావడంతో కింద పడుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకుని బల్ల అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ బాధ్యులు, స్థానికులు ఎల్లమ్మ, మల్లమ్మ, కుసుమ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి నిత్యావసరాల అందజేత



వరంగల్: దళిత హక్కుల ఉద్యమ నేత, బీజేపీ జాతీయ మాజీ అధ్యక్షుడే బంగారు లక్ష్మణ్ 86వ జయంతిని పురస్కరించుకుని కాశిబుగ్గ వెల్ఫేర్ సొసైటీ కాలనీలోని అనాథ ఆశ్రమానికి నిత్యావసర సరుకులను పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పోలెపాక మార్టిన్ లూథర్ ఆధ్వర్యంలో లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎరుకల రఘునారెడ్డి, గడల కుమార్, బాకం హరిశంకర్, జన్ను ఆరోగ్యం, జన్ను సుబ్రహ్మణ్యం, మైదం సుదర్శన్, పోలెపాక జనార్దన్, విజయ్, సదానందం, రాకేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



మడికొండ: మడికొండ పోలీసుస్టేషన్ పరిధిలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి అక్కడ సైన్ బోర్డులు, స్టాప్ బోర్డులను ఇన్‌స్పెక్టర్ కిషన్ సోమవారం ఏర్పాటు చేయించారు. భట్టుపల్లి, కడిపికొండ, ఔటర్ రింగ్‌రోడ్డుపై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు రాక నష్టపోతున్న విద్యార్థులు

హన్మకొండ: ప్రభుత్వం ఫీజ్ రీయింబర్స్‌మెంట్ చెల్లించక, స్కాలర్‌షిపులు చెల్లించకపోవడంతో డిగ్రీలు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందక నష్టపోతున్నారని మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీర సీతారాం నాయక్ ఇక ప్రకటనలో తెలిపారు. విద్య పట్ల చిన్నచూపు చూడడం ప్రభుత్వానికి తగదని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి డిగ్రీలు పూర్తి చేసుకుంటే.. ప్రభుత్వం ఫీజులు చెల్లించడం లేదనే నెపంతో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు ధ్రువ పత్రాలు ఇవ్వకుండా వేధిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు.


స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి



వరంగల్: రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని యువజన కాంగ్రెస్ వరంగల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు కొరివి పరమేష్ పిలుపునిచ్చారు. ఇటీవల భారీ మెజార్టీతో గెలిచిన పరమేష్‌ను మొగలిచెర్ల గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో సురేష్, రంజిత్, రమణ, సాయి, సుభాష్, భార్గవ్, భిక్షపతి, ప్రవీణ్, సాయి తేజ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రమదేవి విగ్రహం నీటిపాలు

- ఏడాదిగా చెరువు నీటిలోనే విగ్రహం
- వెలికితీయాలని కోరుతున్న పర్యాటకులు



రుద్రమదేవి విగ్రహం లేకుండా బోసిపోయి కనిపిస్తున్న గుండు చెరువు



రుద్రమదేవి విగ్రహం (ఫైల్)

ఖిలా వరంగల్: కాకతీయులలో అగ్రగణ్యుడైన గణపతి దేవుడి గారాల పట్టి రాణి రుద్రమదేవి. కాకతీయుల వంశంలో ఆమె ఒక ధ్రువతారగా వెలిగిన మహారాణి. ప్రజారంజక పాలన చేసి కాతీయులకు గొప్ప పేరు, ప్రతిష్ఠతలను తెచ్చిపెట్టిన వీరవనిత. సామంతుల తిరుగుబాట్లనన్నింటిని అణచివేసిన మహా వీరురాలి విగ్రహం నీటిపాలైంది.

పట్టించుకోని పార్కు నిర్వాహకులు

కుడా అధికారుల నేతృత్వంలో నాలుగేళ్ల క్రితం ఏకశిల చిల్డ్రన్ పార్కులో ఏకశిల గుట్ట పక్కన గుండు చెరువు మధ్యలో గుర్రంపై కూర్చొని స్వారీ చేస్తున్న వీరనారి రుద్రమదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం, పార్కు నిర్వాహకుల అలసత్వం వల్ల ఏడాది క్రితం గుర్రం రెండు కాళ్లు విరిగి ఆ విగ్రహం నీటిలో పడిపోయింది. నాటి నుంచి నేటి వరకూ నీటిలోనే ఉండిపోయింది. ఇంత కాలం పర్యాటకులకు కనువిందు చేసిన రుద్రమదేవి విగ్రహం ఏడాదిగా కనిపించడం లేదు. బోటింగ్ చేసే పర్యాటకులను ఆ విగ్రహం ఆకట్టుకునేది. విగ్రహం లేకపోయేసరికి పర్యాటకులు నిరాసక్తితో వెనుదిరుగుతున్నారు. నిత్యం పర్యాటకులతో కిటకిటలాడుతున్న చిల్డ్రన్ పార్కుకు రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా నీటిలో పడిపోయిన విగ్రహాన్ని పార్కు నిర్వాహకులు తీయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నీటిలో పడిపోయిన విగ్రహాన్ని వెలికితీయాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి చెరువులో నీటిలో పడిపోయిన రుద్రమదేవి విగ్రహాన్ని వెలికి తీసి గద్దెపై పునఃప్రతిష్ఠించి కాకతీయ కళారాజ్యానికి వన్నె తీసుకురావాలని పర్యాటకులు కోరుతున్నారు.

బోటులో విగ్రహం చుట్టూ తిరిగేవాళ్లం



మేము వ్యాపార రీత్యా వరంగల్ రంగశాయిపేటలో స్థిరపడ్డాం. ఆదివారం, సెలవు దినాల్లో కుటుంబ సభ్యులమంతా కలిసి తరుచూ మధ్యకోటకు వెళ్తుంటాం. ఏకశిల పార్కులో సరదాగా గడిపి, అనంతరం గుండు చెరువులో బోటు షికారు చేస్తూ రుద్రమదేవి విగ్రహం చుట్టూ తిరుగుతూ వీక్షించేవాళ్లం. ప్రస్తుతం ఆ విగ్రహం కనిపించడం లేదు.

– కొండ్రెడ్డి నవీన్‌రెడ్డి, రంగశాయిపేట

రుద్రమదేవి విగ్రహాన్ని వెలికితీయాలి



నాలుగేళ్ల క్రితం కుడా అధికారులు గుండు చెరువు మధ్యలో రాణి రుద్రమదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. చెరువు నీటిలో పగలు సూర్యరశ్మి కిరణాలు పరావర్తనం చెంది బంగారు వర్ణంతో దేదీప్యమానంగా విగ్రహం వెలుగులీనేది. పర్యాటకులకు కనువిందు చేసిన రుద్రమదేవి విగ్రహాన్ని చెరువులో నుంచి వెలికితీసి తిరిగి గద్దెపై ప్రతిష్ఠించాలి.

– అచ్చ వినోద్‌కుమార్, ఫోర్ట్‌రోడ్డు

ఉప ఎన్నికలు వస్తాయనే భయంతోనే సభ

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

హన్మకొండ: ఉప ఎన్నికలు వస్తాయనే భయంతోనే స్టేషన్ ఘనపూర్‌లో సభ నిర్వహించారని మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థాయికి తగ్గట్లుగా రేవంత్‌రెడ్డి మాట్లాడలేదని అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ కవళికలు చూస్తే బాధేసిందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌కు చేసిన ద్రోహం ఆయనను ఇంకా వెంటాడుతోందని తెలిపారు. మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య మాట్లాడుతూ రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే కడియం శ్రీహరితో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యేల మధ్య సఖ్యత లేదని, మంత్రుల మధ్య సమన్వయం లేదని ఆరోపించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు మర్రి యాదవ రెడ్డి, పులి రజనీకాంత్, నయీమొద్దీన్, సారంగపాణి, జనార్దన్, రమేష్, రజనీకుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గ్రూప్ -1 టాపర్‌కు సన్మానం



హన్మకొండ: గ్రూప్ -1 టాపర్ జిన్నా తేజస్విని రెడ్డిని గాంధీనగర్ వాసులు సన్మానించారు. హనుమకొండ గాంధీనగర్‌లో చైతన్య యూత్ అసోసియేషన్ కన్వీనర్ మాడిశెట్టి వీరేందర్ ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు, గాంధీనగర్ వాసులు.. తేజస్విని రెడ్డితో పాటు ఆమె తల్లిదండ్రులు హేమలత, విజయ్‌పాల్ రెడ్డిని సోమవారం అభినందించారు. కార్యక్రమంలో షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్, కాలనీవాసులు దుగ్యాల వేణుగోపాల రావు, నక్క లింగయ్య యాదవ్, బత్తిని శ్రీనివాస్, కాసర్ల వెంకటేశ్వర రావు, ఆకుల శ్యాంప్రసాద్, చిట్టిరెడ్డి తిరుపతి రెడ్డి, రామకృష్ణారెడ్డి, కర్ర శ్రీనివాస్ రెడ్డి, కొత్త కరుణాకర్, హన్మాస్ తిరుపతి రెడ్డి, సమ్మెట రాంబాబు, బంక రమేష్, మానుపాటి శ్రీను, సత్యనారాయణ రెడ్డి, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలను ప్రోత్సహించాలి



విజయశాంతిని సన్మానించి ఆర్థికసాయం అందజేస్తున్న బాబురావు

హన్మకొండ కల్చరల్: మహిళలు ఏ రంగంలోనైనా విజయం సాధిస్తారని, వారిని ప్రోత్సహించాలని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు సూచించారు. వరంగల్ హంటర్ రోడ్డులోని జానపద గిరిజన విజ్ఞానపీఠంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠం పరిశోధకురాలు పతకమూడి విజయశాంతిని బాబురావు సన్మానించి పరిశోధన ప్రోత్సాహానికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ చూరేపల్లి రవికుమార్, డాక్టర్ బాసని సురేష్, అబ్బు గోపాల్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా సతీష్, సిద్దోజు సునంద, సిబ్బంది ఆంజనేయులు, అశోక్, కస్తూరిబాయి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి



హన్మకొండ చౌరస్తా: హనుమకొండ కాకాజీకాలనీలోని ఎస్సీ బాలుర హాస్టల్ ఎదుట స్వేరో స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ గత నెల 21వ తేదీన విద్యార్థులను వార్డెన్ సదానందం కొట్టాడని అన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా కనీస చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి సదరు వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివకుమార్, రాజ్‌కుమార్, చరణ్, రఘు, శ్రీరామ్, కృష్ణ, ప్రవీణ్, చందు పాల్గొన్నారు.

ఓయూలో నిషేధాజ్ఞలు ఎత్తివేయాలి



కేయూలో నిరసన తెలుపుతున్న నాయకులు

కేయూ క్యాంపస్: ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు, విద్యార్థి సంఘాల ధర్నాలు, నిరసనలను నిషేధిస్తూ అక్కడి వీసీ జారీచేసిన సర్క్యులర్‌ను వెంటనే ఎత్తివేయాలని కాకతీయ యూనివర్సిటీ బీఆర్‌ఎస్‌వీ నాయకులు కోరారు. ఈమేరకు క్యాంపస్‌లోని లైబ్రరీ ఆవరణలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో తమ సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు నిరసన తెలిపే హక్కుపై నిషేధాజ్ఞలు శోచనీయమన్నారు. బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్ర, నాయకులు వస్తం అనిల్, రాజేష్, మహేష్, గణేష్, అఖిల్, సునీత్, హరి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు



ట్రోఫీ అందజేస్తున్న కార్పొరేటర్ శివకుమార్

హసన్‌పర్తి: క్రీడలతో మానసిక వికాసం చేకూరుతుందని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో 20 రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. ఓటమిని స్ఫూర్తిగా తీసుకుని గెలుపు కోసం ప్రయత్నించాలని సూచించారు. విన్నర్‌గా నిలిచిన అంజలి కిడ్నీకేర్, రన్నర్ కోటి లెవన్ జట్లకు నగదుతో పాటు ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, పీఏసీఎస్ డైరెక్టర్ నేదునూరి కుమారస్వామి, మాస్టర్స్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడెల మురళి, సభ్యులు వల్లాల యాదగిరి, సతీష్, జె.రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగట్టు జాతరలో భక్తుల సందడి

- నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు



ఆలయంలో కిక్కిరిసిన భక్తులు

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం క్షీరాభిషేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. నాలుగో రోజు కూడా భక్తుల తాకిడి ఎక్కువగానే కనిపించింది. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఉత్సవాలను పురస్కరించుకుని విశ్వక్సేన ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగియనున్నాయి. సాయంత్రం 5గంటలకు హసన్‌పర్తి – భీమారం గ్రామాలకు అలివేలు మంగ – వేంకటేశ్వరస్వామి వేంచేయనున్నారు.

అద్భుతంగా తీర్చిదిద్దుతా..

ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కబ్జాకు గురైన ఆలయ భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ వెంకటస్వామి, ఈఓ వెంకట్రామ్, డివిజన్ అధ్యక్షుడు కిరణ్, గడ్డం శివరాంప్రసాద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయభాస్కర్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు నరేడ్ల శ్రీధర్, పావుశెట్టి శ్రీధర్, ఆటికం రవీందర్ తదితరులు వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి



వడ్డేపల్లి ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

వరంగల్ అర్బన్: వేసవిలో నీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని నగర మేయర్ గుండు సుధారాణి సూచించారు. హనుమకొండ వడ్డేపల్లి ఫిల్టర్‌బెడ్, బాలాజీ నగర్, కాజీపేట విష్ణుపురి, సోమిడిలోని ఈఎస్‌ఎల్‌ఆర్‌లను క్షేత్రస్థాయిలో కమిషనర్ అశ్విని తానాజీతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్‌ను సందర్శించి నీటి సరఫరా తీరు, శుద్ధీకరణ విధానం, సరఫరాపై ఆరా తీశారు. బాలాజీనగర్, సోమిడి వాటర్ ట్యాంక్‌లను పరిశీలించారు. వడ్డేపల్లి జంక్షన్ విస్తరణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి టౌన్ ప్లానింగ్ అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సిరంగి సునీల్, విజయశ్రీ, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఈఈ రవికుమార్, మహేందర్, డీఈ సారంగం, కార్తీక్ రెడ్డి, మాధవీలత, హెచ్ఓ రమేష్, ఏఈ సరిత పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



హనుమకొండ బొక్కలగడ్డలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మసీదు కమిటీ సభ్యులు

న్యూశాయంపేట: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు.. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ధర్నాకు సంఘీభావంగా జోహర్ నమాజ్ అనంతరం గ్రేటర్ వరంగల్ పరిధిలోని అన్ని మసీదుల ఎదుట మసీదు కమిటీల ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని సోమవారం శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ ముస్లిం యూనిటీ అండ్ డెవలప్‌మెంట్ మూవ్‌మెంట్ అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ అబ్దుల్ సుభాన్, మహ్మద్ అబ్దుల్ ఖుద్దూస్ మాట్లాడుతూ అన్ని విపక్షాలు వ్యతిరేకించినా, లక్షలాది మంది ముస్లింలు జాయింట్ పార్లమెంటరీ కమిటీ బిల్లుకు వ్యతిరేకంగా మెయిల్స్ పంపినా కేంద్రం ఖాతరు చేయకుండా ఏకపక్షంగా బిల్లును తీసుకొచ్చిందని ఆరోపించారు. సమావేశంలో కమిటీ బాధ్యులు జుబేర్ బ్లూబర్డ్స్, అజీజ్ ఉల్లాబేగ్, నయీమ్, ఖలీల్, మున్నాభాయ్, షఫీ, బాబా, ఫైజ్, ఖాదర్‌వలీ, హబీబ్‌ఖాన్ పాల్గొన్నారు.

ఆ వైద్యులను వెంటనే సస్పెండ్ చేయాలి



ఆందోళన చేస్తున్న ఐద్వా నాయకులు

ఎంజీఎం: సీకేఎం ఆస్పత్రికి కాన్పు కోసం వచ్చిన ఈర్ల వెన్నెలకు నిర్లక్ష్యంగా సర్జరీ చేసిన వైద్యులను వెంటనే సస్పెండ్ చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) వరంగల్ జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. ఈమేరకు ఐద్వా ఆధ్వర్యంలో నగరంలోని సీకేఎం ఆస్పత్రి ఎదుట సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 11న గర్భిణి ఈర్ల వెన్నెలకు సర్జరీ చేసే క్రమంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించి కడుపులోనే ప్యాడ్ ఉంచి కుట్లు వేయడంతో ఆమె ప్రాణాపాయ స్థితికి వెళ్లగా బాలింత కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి ఆమెకు చికిత్స అందిస్తున్నారని తెలిపారు. అనంతరం సీకేఎం ఆస్పత్రి ఆర్ఎంఓ మురళి, సూపరింటెండెంట్ షర్మిలకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు భవాని, ఎండీ.బేగం, జిల్లా సహాయ కార్యదర్శులు సంగీత, వాణి, జిల్లా కమిటీ సభ్యులు మైదం వినోద, హసీనా, ఎన్టీఆర్ నగర్ కాలనీ వాసులు, బాధిత మహిళ కుటుంబం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నాయకుడి ఆగడాలను అరికట్టాలి

వరంగల్: వరంగల్ ఎన్టీఆర్‌నగర్‌లో ఓ కాంగ్రెస్ నాయకుడి ఆగడాలను అరికట్టాలని కొంతమంది మహిళలు కాలనీలోని ఎన్టీఆర్ విగ్రహం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతని వద్ద నుంచి తమ డబ్బులు ఇప్పించాలని నినాదాలు చేశారు. అధికార పార్టీ పేరు చెప్పి బెదిరించడం, భూ పంచాయతీల్లో జోక్యం చేసుకోవడం, పోలీసు స్టేషన్లలో పంచాయితీలు, ఆర్థిక లావాదేవీల్లో సెటిల్‌మెంట్లు, గతంలో చేపట్టిన పదవులను చెప్పుకుంటూ, ఒక పత్రిక రిపోర్టర్ అని బెదిరిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా, ఈ విషయంపై సదరు నాయకుడిని వివరణ కోరగా తనకు పార్టీ నుంచి నామినేటెడ్ పదవి వస్తుందని తెలిసి.. ఓ నాయకుడు కావాలని ఇలాంటి కార్యక్రమాలు చేయిస్తున్నాడని అన్నాడు. ఇది సరికాదని హెచ్చరించారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

వరంగల్ అర్బన్: ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు బల్దియా ప్రధాన కార్యాలయంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 8వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో నాయకులు గంగారం మల్లన్న మాదిగ, ఈసంపెల్లి రాజు, మాదాసి సుధాకర్ మాదిగ, కల్లెపెల్లి రమేష్ మాదిగ, జన్ను మాణిక్యం మాదిగ, నమ్మిండ్ల సంపత్ మాదిగ, మంద సుమలత మాదిగ, మేడిది భద్రాద్రి రామయ్య, నక్క రాజు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

హన్మకొండ: మాదిగలను కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మించి మోసం చేస్తోందని తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకుడు దాస్యం విజయ్‌భాస్కర్ అన్నారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 9వ రోజుకు చేరుకున్నాయి. సుకుమార్, మంద కుమార్ మాదిగ, వేల్పుల సూరన్న కాపు, జన్ను దినేష్, మంద రాజు, పుట్ట భిక్షపతి, చాతల్ల శివ మాదిగ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

చేపల పెంపకంతో అధిక లాభాలు

మామునూరు : చేపల పెంపకంతో అధిక లాభాలు అర్జించొచ్చని సీనియర్ శాస్త్రవేత్త, కేవీకే కోఆర్డినేటర్ రాజన్న తెలిపారు. సోమవారం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో పీవీ నరసింహారావు తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి హైదరాబాద్ సౌజన్యంతో చెరువుల్లో చేపల మెరుగైన ఉత్పత్తి, యాజమాన్యంపై మత్స్యకార రైతులకు అవగాహన కల్పించారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

హన్మకొండ అర్బన్ : పశ్చిమ నియోజకవర్గ ఓటర్ల జాబితా సవరణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం హనుమకొండ ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ రాథోడ్ రమేశ్ సమావేశాన్ని నిర్వహించి అభ్యంతరాలు స్వీకరించారు.

ఎస్పీఎం షెడ్ల ఆధునీకరణ

హన్మకొండ : డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులో నాణ్యత పెంచడానికి, పనులు వేగవంతం చేయడానికి ఎస్పీఎం షెడ్లను ఆధునీకరిస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ టి.మధుసూదన్, చీఫ్ జనరల్ మేనేజర్లు కె.రాజు చౌహాన్, కె.వెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం హనుమకొండ పెద్దమ్మగడ్డలోని ఆధునీకరించిన ఎస్పీఎం షెడ్‌ను అందులో అమర్చిన యంత్రాలను ప్రారంభించారు.

రేపు ఈఆర్సీ బహిరంగ విచారణ

హన్మకొండ : ఎన్పీడీసీఎల్ 2025–26 ఆర్థిక సంవత్సరానికి సవరణ చేయబడిన ఆదాయ ఆవశ్యకత, రిటైల్ సరఫరా ధరలు, క్రాస్ సబ్సిడీ సర్‌చార్జీల ప్రతిపాదనలపై ఈ నెల 19న (బుధవారం) బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

20న బల్దియా బడ్జెట్ సమావేశం

వరంగల్ అర్బన్ : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్(జీడబ్ల్యూఎంసీ) 2025–26 బడ్జెట్‌పై ప్రత్యేక సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సెక్రటరీ అలువేలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మేయర్ సుధారాణి అధ్యక్షతన జరిగే సమావేశంలో ఎక్స్ అఫిషియో సభ్యులు, కార్పొరేటర్లు, కమిషనర్, వింగ్ అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు.

మా భూమి రథయాత్ర వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

వరంగల్ అర్బన్: తెలంగాణలో ధర్మ సమాజ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ చేపట్టనున్న లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర వాల్‌పోస్టర్లను బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో పార్టీ వరంగల్ జిల్లా నాయకులు సోమవారం ఆవిష్కరించారు.

రాంచీలో మెట్రాలజీ రూల్స్ సవరణపై శిక్షణ

ఖిలా వరంగల్: ఈనెల 19, 20వ తేదీల్లో జార్ఖండ్ రాష్ట్ర రాజధాని రాంచీ జిల్లా కేంద్రంలో కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో లీగల్ మెట్రాలజీ రూల్స్ -2011 సవరణలపై శిక్షణ కార్యక్రమం జరగనుంది. ఈ శిక్షణకు వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి ప్రధాన కార్యదర్శి మొగిలిచర్ల సుదర్శన్‌కు ఆహ్వానం అందింది.

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

ఖిలా వరంగల్: విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు లక్ష్యాన్ని ఎంచుకుని క్రమశిక్షణతో చదువుకోవాలని విద్యావేత్త గట్ల రాంరెడ్డి సూచించారు. ఈ మేరకు వరంగల్ ఫోర్ట్‌రోడ్డు రుద్రమాంబ నగర్‌లోని టాలెంట్ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ ముక్కెర రవీందర్ ఆధ్వర్యంలో తమ తల్లిదండ్రులు, గురువులకు విద్యార్థులు సోమవారం పాదాభివందనం చేశారు.

నియామకం



హన్మకొండ అర్బన్: భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి యువజన విభాగం హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా నగరంలోని పోస్టల్ కాలనీకి చెందిన నడిపల్లి శ్రీధర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ నియామక పత్రం అందజేశారు.

ఎంసెట్ ఉచిత కోచింగ్ పోస్టర్ ఆవిష్కరణ

విద్యారణ్యపురి: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) సామ జగన్మోహన్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా ఎంసెట్ శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ఏబీవీపీ నాయకుడు సుజిత్ తెలిపారు. ఈమేరకు సంబంధిత పోస్టర్లను హనుమకొండ డీఐఈఓ గోపాల్ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మడికొండ: ప్రమాదవశాత్తు ఇటీవల మృతి చెందిన చేపూరి అనిల్‌కుమార్ (28) కుటుంబ సభ్యులకు శ్రీమెట్టు రామలింగేశ్వర స్వామి కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పల్లపు యాదగిరి సోమవారం ఆర్థికసాయం అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మడికొండ: అనారోగ్య సమస్యలతో ఆదివారం మృతి చెందిన గడ్డం అయిలయ్య(65) కుటుంబ సభ్యులను వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ సోమవారం పరామర్శించారు.

ఉపాధ్యాయుడు శ్రీధరాచార్యులకు సన్మానం

సాక్షి, వరంగల్ : ఎల్బీనగర్‌లోని మసూమ్ అలీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు తయ్యాల శ్రీధరాచార్యులను రోజా క్రియేషన్స్ సంస్థ, ఇంద్ర ధనస్సు సంస్థ హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన పీఠంలో సన్మానించారు.

అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలి

వరంగల్ అర్బన్: వరంగల్ నగరంలోని అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఎంసీపీఐ (యూ) కాశిబుగ్గ జోన్ కార్యదర్శి పరిమళ గోవర్ధన్ డిమాండ్ చేశారు. ఈమేరకు బల్దియా కార్యాలయంలో ఎదుట అర్హులైన మహిళలతో కలిసి సోమవారం నిరసన తెలిపారు.

కేయూలో ఇద్దరు విద్యార్థుల మధ్య ఘర్షణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామన్‌మెస్ సమీపంలో జర్నలిజం విభాగానికి చెందిన ఇద్దరు విద్యార్థులు పరస్పరం ఘర్షణకు దిగినట్లు సమాచారం. ఈ విషయాన్ని జర్నలిజం విభాగం అధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్ దృష్టికి తీసుకెళ్లినట్లు కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్‌పీ.రాజ్‌కుమార్ తెలిపారు.

పట్టువస్త్రాల సమర్పణ

హన్మకొండ కల్చరల్: హనుమకొండ శాయంపేటలోని ఆనంద నర్సింహస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణం సందర్భంగా భద్రకాళి దేవాలయం నుంచి పట్టువస్త్రాలు, తలంబ్రాలు, పండ్లను భద్రకాళి దేవాలయ ఈఓ శేషుభారతి సోమవారం సమర్పించారు.

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
వి. రాజ్ కుమార్ (SR) : 9966290903 (హన్మకొండ)
కె. రవీందర్ (SR) : 9705236356 (వరంగల్)
పి. చంద్రశేఖర్ (ACO) : 9963646944 (వరంగల్)